సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా



The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 52 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | సోమవారం | 09.06.2025

# బస్వరాజా ఇది తగునా!

- పేద రైతు భూమిపై కన్నేసిన ఎమ్మెల్సీ అనుచరులు
- కబ్జాకు సారయ్య సహకారం అందిస్తున్నడని ఆరోపణ
- లబోదిబో మంటున్న రైతు కుటుంబం
- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదట..!






బస్వరాజు సారయ్య.. ఆయనో బీసీ నేత.. కింది స్థాయి నుంచి మంత్రి వరకు ఎదిగిన మనిషి.. ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్సీ.. ఇది అందరికీ తెలిసిన విషయమే.. కానీ ప్రజాసేవ చేయాల్సిన ఆయన పేద రైతు భూమిపై కన్నేసిన తన అనుచరులకు సహకారం అందించడం పలు విమర్శలకు తావిస్తోంది. అక్రమంగా పట్టాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తులకు ఆ భూమిని దక్కించేందుకు సారయ్య తన సర్వశక్తులు ఒడ్డుతున్నట్టు తెలుస్తోంది. ఆ ధీమాతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామానికి చెందిన మంద శోభ వెంకటేశంకు అశ్వరావుపల్లి శివారులో వంశపారపర్యంగా వచ్చిన 8.32 ఎకరాల భూమి ఉంది. అయితే ఇందులో 4.16 ఎకరాల భూమి వీరికి రావాల్సింది. ఈ భూమిని తమ పాలివారైన మంద లక్ష్మయ్య, మంద రాములు, చిన్న గట్టయ్య, కొండ లక్ష్మి, మంద సరోజన అక్రమంగా లాక్కున్నారు. దీనిపై శోభ వెంకటేశం, జె.సువర్ణ జనగామ కోర్టు, హైకోర్టులో కేసు వేశారు. ఆ కేసు నడుస్తుండగానే కొండ లక్ష్మి, మంద సరోజన, మంద రాములు, లక్ష్మయ్య వరంగల్‌కు చెందిన ఎన్ఆర్ఐ కుందారపు సుధాకర్‌కు ఆ భూమిని బేరం పెట్టారు. భూ వివాదం విషయాన్ని వెంకటేశం కొనుగోలుదారుడైన సుధాకర్‌కు విన్నవించాడు. అయినా ఆయన పట్టించుకోకుండా భూమిని కొనుగోలు చేశాడు. ఆ తర్వాత జనగామ కోర్టు, హైకోర్టు శోభ, సువర్ణలకు స్టే ఆర్డర్, స్టేటస్ కోను ఇచ్చింది. కానీ భూమి కబ్జాపై మాత్రం సుధాకర్ ఉంటూ వస్తున్నాడు. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయరాదని, వేరే వారికి అమ్మరాదని కోర్టు ఆదేశించినా సుధాకర్ వినిపించుకోకుండా భూమికి ప్రహరీతో పాటు గదులను నిర్మించాడు.

## అడ్డుకుంటే బెదిరింపులు..

కోర్టు ఆర్డర్ ఉన్న భూమిలో ఎలా నిర్మాణాలు చేపడుతారని అడ్డుకుంటే తమపై దాడులు చేశారని బాధిత రైతులు శోభ, వెంకటేశం తెలిపారు. మరోసారి భూమి వద్దకు వస్తే ఊరుకోమని, ఎంతటికైనా తెగిస్తామని కుందారపు సుధాకర్ ఆయన అనుచరులు జీవన్ రెడ్డి, దోమల ప్రభాకర్ తమను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. 'మాకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అండ ఉంది మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ వార్నింగ్‌లు ఇచ్చినట్టు వాపోయారు.




## వారి వెనుక సారయ్య ఉన్నడంట..

అశ్వరావుపల్లి శివారులో మాకు వంశపారపర్యంగా 4.16 ఎకరాల భూమి రావాలి. మా పాలివారు దానిని అక్రమంగా పట్టా చేసి కుందారపు సుధాకర్ అనే ఎన్ఆర్ఐకి అమ్మారు. మేం కోర్టుకు వెళ్తే మాకు స్టే ఆర్డర్, స్టేటస్కో ఆర్డర్ ఇచ్చారు. నాయ్యం కోసం ఎంతో మంది అధికారులు చుట్టు తిరిగినా ఫలితం లేదు. సుధాకర్కు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అండ ఉందంట. ఏం చేసుకుంటారో చేసుకో అని బెదిరిస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు నాయ్యం చేయాలి.

*- మంద శోభ, వెంకటేశం, బాధిత రైతు కుటుంబం*


## 'స్టేషన్'లో సారయ్య అడుగులు!

బస్వరాజు సారయ్య తూర్పు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2016లో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన 2020 నవంబర్‌లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. 2024లో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. తూర్పు నియోజకవర్గంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన కొన్ని రోజులుగా కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్‌లో భూ సెటిల్‌మెంట్లకు తెరలేపడం గమనార్హం. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి భూమి విషయంలో సారయ్య ఇప్పటికే పలు మార్లు ఇక్కడి వచ్చి ఉన్నతాధికారులను కలిశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన అనుచరులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని సదరు అధికారులను ఒత్తిడికి గురి చేసినట్టు సమాచారం. మొత్తానికి ఎమ్మెల్సీ సారయ్య ఇలా భూ సెటిల్‌మెంట్లకు తెరలేపడం కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అసహనం వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

## పరిహారం ఫలహారం!

- నేషనల్ హైవే మాటున మూటలు మాయం!
- కోట్ల రూపాయలు స్వాహా చేసిన ఘనులు
- అందులో అధికారులకూ వాటాలు

త్వరలో.. మన చౌరాస్తాలో..



# చేప మందు మూఢ నమ్మకం

- ఆ మందుతో నష్టమే తప్ప ఆరోగ్య ప్రయోజనం శూన్యం
- ఈ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహించొద్దు
- రిటైర్డ్ కర్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి

జనగామ, మన చౌరాస్తా : చేప మందుతో అస్తమా తగ్గుతుందనేది పచ్చి బూటకమని రిటైర్డ్ కర్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. మృగశిర కార్తె సందర్భంగా చేప మందు పంపిణీపై ఆయన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జనగామలో ఆయన మాట్లాడారు. ఆధునికంగా, సాంకేతికంగా భారతదేశం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆశాస్త్రీయ విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. అసమాకు అలోపతిలో మంచి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆశాస్త్రియ విధానాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. చేప మందు పంపిణీలో బ్రీడ్ , నీరు ఎలాంటివి వాడుతున్నారో తెలియదని, దానికి ఒక ఫార్ములా అంటూ లేదని స్పష్టం చేశారు. ఒకవేళ దానితో ప్రయోజనం ఉంటే ఏడాదికి ఒకేసారి కాకుండా నిత్యం అందుబాటులో ఉంచ వచ్చు కదా అని అనుమానం వ్యక్తం చేశారు. సరైన రుజువు లేని చేప మందు పంపిణీకి ప్రభుత్వం ఏకంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



# మరణంలోనూ స్నేహబంధం

- మేడిగడ్డ బ్యారేజ్‌లో ఆరుగురి మృతదేహాలు లభ్యం
- శోకసముద్రంలో కుటుంబ సభ్యులు

**జయశంకర్ భూపాలపల్లి, మన చౌరాస్తా :**

కాలేజీలో చదువుకునే విద్యార్థుల స్నేహం మరణంలోనూ వారి బంధం వీడలేదు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు వేర్వేరు కుటుంబాలకు చెందిన మరో నలుగురి తోపాటు ఇంకొకరు ఏడుగురు వేసవి కాలం కావడంతో ఈత కొట్టేందుకు ఆనందోత్సవంతో మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరికి వెళ్లారు. వర్షాలు లేవు వరద అంతంత మాత్రమే అయినా గోదారిలో భారీ గుంతలు ఉన్నట్లు వారికి తెలియదు. గోదావరిలో స్నానం చేయడానికి దిగిన యువకులు అకస్మాత్తుగా మాయమయ్యారు. శవమై తేలారు. పట్టి శివ అనే ఓ యువకుడు మాత్రం చకచక్యంగా బయటపడ్డాడు. ఏమైందో తెలియదు నా స్నేహితులు గోదావరిలో దిగినట్టే దిగి మాయమయ్యార అంటూ లబోదిబో మంటూ భయంతో వణికి పోయాడు. మహాదేవపూర్ మండలం అంబటిపల్లి వద్ద శనివారం సాయంత్రం జరిగిన విషాద ఘటన మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గోదావరిలో గల్లంతైన వారి కోసం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులు ఎదురు చూడక తప్పలేదు. గోదావరిలో శవాల ఆచూకీ కోసం రాత్రంతా గజ ఈతగాళ్లు పడరాని పాట్లు పడ్డారు. కానీ వారి ఆచూకీ ఆదివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు జాలర్లు గుర్తించారు. అంబటిపల్లి చెందిన ఇద్దరు కుమారులు మధుసూదన్ (18), శివ మనోజ్(15), తొగరి రక్షిత్(13), కర్నాల సాగర్ (16), మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన బొల్లెట్ల పండు (18), పిపి స్తంభంపల్లికి చెందిన



పసుల రాహుల్ (19) ఆరుగురిని ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా బయటికి తీయడంతో వారి తల్లిదండ్రులు రోదన గోదావరి నది గొల్లుమన్నది. మృతులను చూసేందుకు వందలాది మంది గోదావరి చేరుకోవడంతో ఆ పరిసర ప్రాంతం కిక్కిరిసింది. ఘటన స్థలాన్ని మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ చేరుకొని గల్లంతమైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మారంగా చేపట్టి గజ ఈతగాళ్లు, జాలర్ల సాయంతో యువకుల మృతదేహాలను బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన యువకుల మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దిగ్భ్రాంతికి గురయ్యాడు. వారి మరణం వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని విచారం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన లింగాలఘణపురం మండలంలోని వడ్డిచెర్ల గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ముదుగులోజు వినయ్ (27) బైక్‌పై జనగామకు వెళ్తుండగా, జనగామ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న డీసీఎం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గ్రామంలో వెల్డింగ్ కట్టారుగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు చెప్పారు. మృతునికి భార్య శృతి, తండ్రి పరమాత్మ చారి, తల్లి ఉమారాణి ఉన్నారు. కాగా, మృతుడి వినయ్‌కి మార్చి 16న హైదరాబాదులోని బోడుప్పల్‌కు చెందిన శృతితో వివాహం జరిగింది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో వినయ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## టిప్పర్ ఢీకొని బాలిక మృతి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తతో బాలిక మృతి చెందిన ఘటన పెద్ద వంగర మండలం చిన్నవంగర గ్రామ శివారు కిష్టు తండాలో జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండా చెందిన జాటోతో సోమన్న కుమార్తె ఇందుమతి (11) పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో సైకిల్ పై ఇంటి ముందు నుంచి తండా శివారు గుడికి వెళ్తోంది. సర్వీస్ రోడ్ నుంచి వెళ్తున్న ఆమెను వెనక నుండి అతివేగంతో వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో బాలిక అక్కడిక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## 10న రఘుపాల్ సంస్కరణ సభ

**జనగామ, మన చౌరాస్తా :** కామ్రేడ్ రఘుపాల్ సంస్కరణ సభ ఈ నెల 10న నిర్వహించనున్నట్టు సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఏసి రెడ్డి నగర్, గిన్నిగడ్డ, ధర్మకంచ, సంజయ్ నగర్ ప్రాంతాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జనగామ ప్రాంత ఉద్యమ నాయకుడు అమరజీవి రఘుపాల్ సంస్కరణ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలిపించారు. ఉన్నత విద్యను అభ్యసించిన రఘుపాల్ వెటర్ని డాక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ప్రజల కోసం ఉద్యోగాన్ని సైతం వదిలిపెట్టి మహనీయుడని కొయాడారు. మంగళవారం నెహ్రూ పార్క్ వద్ద ఉన్న కామాక్షి ఫంక్షన్ హాల్లో జరుగు ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు ఎండి అజారుద్దీన్, కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బొట్ల శ్రావణ్, బూడిది ప్రశాంత్, శాఖ కార్యదర్శిలు గుండె మల్లేష్, బూడిద అంజమ్మ, ఎండి గౌసియా, నాజియా, అబ్రహం లింకన్, ఆది, పోశయ్య, బాలమణి, లక్ష్మి, రేణుక, తిమోతి, సుధాకర్, రమాదేవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## దొంతిని కలిసిన తొర్రూరు ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి బొకే అందజేశారు. నియోజకవర్గ రాజకీయ, అభివృద్ధి పనులపై రానున్న ఎన్నికలపై చర్చించినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. అనంతరం మాధవరెడ్డి సైతం తిరుపతిరెడ్డిని సన్మానించారు.







# జన నేతకు కన్నీటి వీడ్కోలు

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణం
- శోకసంద్రంలో నగరం
- గ్రేటర్ రాజకీయాల్లో తనదైన ముద్ర
- అభివృద్ధి, సంక్షేమమే ఆయనకు రెండు కండ్లు



**హైదరాబాద్, మన చౌరాస్తా :**

అభివృద్ధి ఒక్కటే సరిపోదు.. సంక్షేమం కూడా అందరికీ అందాలని నిత్యం తపించే నాయకుడు , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో నగరం శోకసంద్రంలో మునిగిపోయింది. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి.. ప్రజా ప్రయోజనాల కోసం పరితపించే వ్యక్తిగా రాజకీయాల్లో ఆయన తనకంటూ ప్రత్యేకతను చాటారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు మాగంటికి ఉంది. ప్రజలతో ప్రతి నిత్యం మమేకమై అనేక సమస్యలను పరిష్కరించి, మృధు స్వభావిగా మంచిపేరు తెచ్చుకున్నారు. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదర్శవంతమైన వ్యక్తిగా తనదైన ముద్ర వేసుకున్నారు.

## రాజకీయాల్లో చెరగని ముద్ర

మాగంటి గోపీనాథ్ 1983లో దివంగత నేత నందమూరి తారక రామారావుపై అభిమానంతో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 1992 వరకు తెలుగుదేశం అనుబంధ సంస్థ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 1987, 1988 సంవత్సరాల్లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1988 నుంచి 1993 వరకు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా, తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు.

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ నుంచి జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఐఎం అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9,242 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం 2018 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డిపై 16,004 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2018లోనే శాసనసభలో పీఈసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన 2022 జనవరి 26న బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

## సినీ పరిశ్రమలోనూ ప్రత్యేక స్థానం

మాగంటి గోపీనాథ్ సినీ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక ముద్ర వేశారు. సినిమాలపై ప్రత్యేక ఆసక్తి కనబర్చే మాగంటి.. నిర్మాతగా పలు చిత్రాలను తీశారు. 1995లో పాతబస్తీ, రవన్న (2000), భద్రాద్రి రాముడు (2004), నా స్టైలేవేరు (2009)లో సినిమాలు తీసి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. అధికారం కోసం పూటకో పార్టీ మార్చే నేతలున్న ప్రస్తుత రాజకీయ రంగంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ది పూర్తిగా విభిన్నమైన శైలి. నమ్మిన నేతను వదిలిపెట్టి స్వార్థం కోసం వేరే పార్టీలోకి వెళ్లడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేదంటూ అనేకసార్లు తన సన్నిహితుల వద్ద కుండబద్దలు కొట్టేవారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానిగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఆయన రాజకీయ రంగప్రవేశంతో 1983 నుంచి పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. తొలి సారిగా 2014లో జూబ్లీహిల్స్ టికెట్ దక్కడంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన మాగంటి గోపీనాథ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాల కారణంగా బీఆర్ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. 32 ఏళ్ల పాటు ఒకే పార్టీలో పనిచేసిన తాను 2015లో పార్టీ మారడానికి కారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైనే తాము ఫోకస్ చేయాలనుకుంటున్నామని, తెలంగాణలో పార్టీ భవిష్యత్ కష్టమేనని పెద్దలు స్పష్టమైన అభిప్రాయానికి రావడమేనని ఎమ్మెల్యే మాగంటి పలు సందర్భాల్లో చెప్పేవారు. బీఆర్ఎస్‌లోకి రావడానికి ప్రధానమైన కారణం ఉద్యమ సారథి కేసీఆర్‌లోని మంచితనమే అని, తెలంగాణ వస్తే హైదరాబాద్‌లోని సీమాంధ్రుల పరిస్థితి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమైన తరుణంలో కేసీఆర్ పాలన భరోసా కల్పించిందని, అందుకే తాను బీఆర్ఎస్‌లో చేరానని పలు సందర్భాల్లో మాగంటి గోపీనాథ్ చెప్పారు. 2023 డిసెంబర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైన తర్వాత పార్టీ మారాలంటూ కాంగ్రెస్ నేతల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. తనను నమ్మి రెండుసార్లు టికెట్ ఇచ్చిన కేసీఆర్‌కు ఎట్టి పరిస్థితిలో ద్రోహం చేసే ప్రసక్తే లేదని మాగంటి స్పష్టం చేశారు.



## కుటుంబ నేపథ్యం

మాగంటి గోపీనాథ్ 1963 జూన్ 2న కృష్ణమూర్తి, మహానంద కుమారి దంపతులకు హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో జన్మించారు. 1980లో వెంకటేశ్వర ట్యూటోరియల్స్ నుంచి ఇంటర్, 1983లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ (బీఏ) పూర్తి చేశారు. ఆయనకు సునీతతో వివాహం జరిగింది. వారికి మాగంటి వాత్సల్యనాథ్ కుమారుడు, అక్షర నాగ, దిశిర అనే ఇద్దరు కుమార్తెలున్నారు. మాగంటి గోసీనాథ్ 1983లో రాజకీయాల్లోకి వచ్చారు. కాగా, సోమవారం జరిగిన మాగంటి అత్యక్రియల్లో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌తో పాటు పలు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు.











# అందరి మనసులు గెల్చుకున్న సోనూసూద్..

రీల్ లైఫ్ లో ఎక్కువగా విలన్ గా కనిపించే సోనూసూద్ రియల్ లైఫ్‌లో మాత్రం హీరో అనిపించుకున్నాడు. కరోనా ఆపత్కాలంలో అతను అందించిన సేవలు, సహాయక కార్యక్రమాలు, దాన ధర్మాలను ఎవరూ అంత ఈజీగా మర్చిపోరు. ఆ తర్వాత కూడా సోనూ సేద్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సహాయక కార్యక్రమాలు చేస్తున్నాడీ రియల్ హీరో. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ఆపన్న హస్తం అందిస్తున్నాడు. ప్రస్తుతం సినిమా షూటింగులో బిజీగా ఉంటోన్న సోనూసూద్ ఇటీవల తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నాడు. అయితే తిరుగు ప్రయాణంలో భాగంగా తిరుమల అంతా కలియ తిరిగాడు సోనూసూద్. ఇదే క్రమంలో తిరుమలలో తట్టపైన బేల్ పూరి విక్రయిస్తున్న చిరువ్యాపారి జ్యోతితో సరదాగా ముచ్చటించాడు. ఆమె కుటుంబ విషయాలు, యోగక్షేమాలు, అలాగే వ్యాపార విషయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక బేల్ పూరి ధర అడిగి తెలుసుకున్న సోనూసూద్ ఆ తర్వాత ఆమె దగ్గర కొను గోలు చేసి రుచి చూశాడు. భేల్ పూరి చాలా బాగుందని ఆమెకు కితాబిచ్చాడు. చిరు వ్యాపారుల దగ్గర మనం కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని సోనూసూద్ చెప్పడంతో జ్యోతి చాలా సంబరపడిపోయింది. గత 25 సంవత్సరాలుగా తిరుమలలో భేల్ పూరి విక్రయిస్తున్నానని ఆమె చెప్పుకొచ్చింది. సినిమా స్టార్ అయినా ఓ సాధారణ వ్యక్తిలా భేల్ పూరి కొను గోలు చేసి జ్యోతితో ముచ్చటించాడు సోనూ సూద్. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. దీనిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు సోనూ సూద్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.





## రష్మికకు క్రేజీ ఛాన్స్..

యానిమల్, పుష్ప 2, ఛావా లాంటి సినిమాల్లో అటు పర్ఫార్మెన్స్.. ఇటు రొమాంటిక్ క్యారెక్టర్స్ చేస్తూ వరస విజయాలు అందుకున్నారు రష్మిక మందన్న. ఈ మూడు సినిమాలతో అమ్మడు బాక్సాఫీస్ క్వీన్ అయిపోయారు. ఈమె అడుగు పెడితే బొమ్మ బ్లాక్‌బస్టర్ అనుకుంటున్న సమయంలో సికిందర్ వచ్చి అంచనాలన్నీ తారుమారు చేసింది. సికిందర్‌లో రష్మిక మందన్న పాత్రకు పెద్దగా ఇంపార్టెన్స్ ఉండదు.. కేవలం 2 పాటలకు పరిమితం చేసారు. రష్మిక లక్‌తో అయినా భాయ్‌కు హిట్ వస్తుందేమో అనుకుంటే.. భాయ్ బ్యాడ్ లక్ రష్మికకు అంటుకుంది. దాంతో ఈ బ్యూటీకి చాలా కాలం తర్వాత ఫ్లాప్ తప్పలేదు. సికిందర్ తర్వాత రష్మిక జోరుకు కాస్త బ్రేకులు అయితే పడ్డాయి. ఆయుష్మాన్ ఖురానాతో థమా సినిమా చేస్తున్నారు రష్మిక. తాజాగా కాక్ టెయిల్ 2లో షాహిద్ కపూర్‌కు జోడీగా ఎంపికయ్యారు రష్మిక. తెలుగులో ఎప్పుడో ఓకే చేసిన గాళ్‌ఫ్రెండ్, రెయిన్ బో లైన్‌లోనే ఉన్నాయి. జూన్ 20న ఈమె నటిస్తున్న కుబేరా సినిమా విడుదల కానుంది. చిన్న బ్రేక్ అయితే వచ్చింది గానీ చూస్తుంటే త్వరగానే బౌన్స్ బ్యాక్ అయ్యేలా కనిపిస్తున్నారు రష్మిక మందన్న.



